

పైసలిస్తేనే పోస్టులు!



- మెడికల్ కళాశాలలో పోస్టులను అమ్మకాలకు పెడుతున్నారనే ఆరోపణలు
- పోస్టుకు రూ.1 లక్ష నుంచి రూ.2.50 లక్షలకు బేరాలు?
- గతంలో కళాశాలలో పని చేసిన ఓ అధికారి మధ్యవర్తిత్వం
- ఇక్కడి నుంచి బదిలీఅయినా వదలని పైరవీలు
- అనుకూలంగా ఉన్న ఏజెన్సీలకు కాంట్రాక్ట్ వచ్చేలా చర్యలు?
- ఉపాధి కార్యాలయంలోని కొందరు సిబ్బంది హస్తం ఉందనే విమర్శలు
- గత పోస్టుల భర్తీలో అవకతవకలపైన ఆరోపణలు
- దీంతో నేరుగా మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో భర్తీ ప్రక్రియ
- తమ పాచికలు పారకపోవడంతో నోటిఫికేషన్‌నే రద్దు చేయించారా?

కామారెడ్డి/కామారెడ్డి టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఏ పోస్టు నోటిఫికేషన్ పడినా రూ.లక్ష కొట్టు.. ఉద్యోగం పట్టు అనే స్కీం నడుస్తుందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నిబంధనలు పాటించకుండా కొన్ని పోస్టులను భర్తీ చేస్తుంటే మరికొన్ని నోటిఫికేషన్‌లు ఇచ్చి ఉద్యోగం వస్తుందనే వారితో బేరసారాలు చేస్తున్నారు. ఏది ఏమైనా చివరకు పైసలిస్తేనే పోస్టులు దక్కుతాయనే అనే సరికొత్త సంస్కృతికి తెరలేపుతున్నారు. కామారెడ్డి మెడికల్ కళాశాలలో పోస్టుల భర్తీ ప్రక్రియ ఇందుకు చక్కటి ఉదాహరణగా చెప్పవచ్చు. కళాశాలలో ఏ పోస్టు పడ్డ పైరవీకారులు మధ్యవర్తిత్వం వహించి ఆ పోస్టులను అమ్మకాలకు పెడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన ఓ అధికారి ఈ వ్యవహారం అంతా నడిపిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే భర్తీచేసిన పోస్టులలోను పెద్ద ఎత్తున అవకతవకలు జరగగా ఇటీవల వేసిన నోటిఫికేషన్‌లోను పైరవీలు మొదలుకావడం, తమకు అనుకూలంగా ఉన్న ఏజెన్సీలకు కాంట్రాక్ట్ దక్కేలా చేసి విషయం బయటకు పొక్కకుండా చూసుకునేలా పథకం రచించడంతో పలువురు నిరుద్యోగులకు సంబంధించిన వ్యక్తులు నిబంధనలకు పాతర వేస్తున్నారని కోర్టు మెట్లు ఎక్కినట్లు సమాచారం. మెడికల్ కళాశాలలో ఇటీవల 51 ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల నుంచి డీడీలు కట్టించుకొని ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు కేటాయించే సమయానికి నోటిఫికేషన్‌ను రద్దు చేయడంలో ఆంతర్యం ఏమిటో తెలియరావడం లేదు. అయితే పోస్టుల భర్తీలో అవకతవకలు జరిగాయని ఒక్కోదానికి రూ.1లక్షకు పైగా బేరాలు సాగించారని మొదటగా అడ్వాన్స్‌గా కొంత డబ్బులు వసూలు చేశారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విధంగా నోటిఫికేషన్‌ల పేరుతో మోసం చేస్తు డబ్బులు ఇచ్చిన వారికి ఉద్యోగాలు దక్కేట్లు చేయడంపై అసలు నోటిఫికేషన్‌లు వేసే బదులు ఇన్ని లక్షలకు ఫలానా పోస్టులు అమ్మబడును అని పెట్టుకుంటే సరిపోతుండే కదా అని పలువురు నిరుద్యోగులు పెదవి విరుస్తున్నారు.

గతంలో కళాశాలలో పని చేసిన ఓ అధికారి మధ్యవర్తిత్వం

కామారెడ్డి జిల్లా కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో మెడికల్ కళాశాల మంజూరైన విషయం తెలిసిందే. ఈ మెడికల్ కళాశాలకు ప్రొఫెసర్‌లను ప్రభుత్వం కేటాయించింది. అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించి పలు పోస్టులకు రెగ్యులర్ సిబ్బందిని కేటాయించారు. అయితే కళాశాలలో ఆయా విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకుగాను నోటిఫికేషన్‌లు జారీ చేసి ఉద్యోగ ప్రక్రియను చేపడుతూ వస్తోంది. అయితే కళాశాలలో ఏ ఔట్ సోర్సింగ్ పోస్టులు పడినా పైరవీలు మాత్రం జోరుగా సాగుతూ లక్షలు చేతులు మారితేనే ఉద్యోగాలు వస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ పనిచేసి మరోచోటకు బదిలీపై వెళ్లిన ఓ అధికారి ఈ అవకతవకల ప్రక్రియను నడుపుతున్నట్లు తెలుస్తోంది. గతంలో కామారెడ్డి మెడికల్ కళాశాలలో సదరు అధికారి పని చేస్తున్న సమయంలో వచ్చిన నోటిఫికేషన్‌ను ఎలాంటి నిబంధనలు పాటించకుండా రూ.1లక్ష నుంచి రూ.2.50లక్షల వరకు ఒక్కోపోస్టుకు వసూలు చేసి కొందరు ఉపాధి కార్యాలయ సిబ్బందితో కలిసి పోస్టుల భర్తీ చేపట్టి ఏజెన్సీకి అప్పగించినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయం కళాశాల ఉన్నతాధికారులకు తెలియడంతో ఇలాంటి అవకతవకలకు మరోమారు చోటు లేకుండా చూసేందుకు చర్యలు చేపట్టి ఇటీవల ప్రభుత్వం అనుమతించిన మరో 51 పోస్టులను నేరుగా భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ నోటిఫికేషన్ ద్వారా తమకు డబ్బులు అందడం లేదని ఉపాధి కార్యాలయంలోని కొందరు సిబ్బంది మరోమారు సదరు అధికారితో పైరవీలు చేసేందుకు పథకం రచించారని సమాచారం. దీంతో రంగంలోకి దిగిన సదరు అధికారి నోటిఫికేషన్ రద్దుకు ప్లాన్‌లు వేసి ఎట్టకేలకు నోటిఫికేషన్ రద్దు చేయించాడనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

అనుకూలంగా ఉన్న ఏజెన్సీలకు కాంట్రాక్ట్ కట్టబెట్టేలా చర్యలు?

మెడికల్ కళాశాలలో భర్తీ చేసిన ఆయా పోస్టులను నిబంధనల ప్రకారం ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో అప్పగిస్తుంటారు. అయితే ప్రస్తుతం నోటిఫికేషన్ రద్దు కావడం మెడికల్ కళాశాలకు పోస్టుల భర్తీ అత్యవసరం కావడంతో త్వరలోనే మరో నోటిఫికేషన్ వేస్తారని తెలుస్తోంది. ప్రస్తుతం సదరు అధికారి అనుకూలంగా ఉన్న ఏజెన్సీలకు కాంట్రాక్ట్ వచ్చేలా పావులు కదుపుతున్నాడని అందుకు ఉపాధి కార్యాలయంలోని అనుకూలంగా ఉన్న సిబ్బంది సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఓ ఏజెన్సీతో సైతం మాట్లాడారని ఆ ఏజెన్సీకి తగినంత అనుభవం లేదని అయినా వారు అనుకున్న పాచికలు పారించేందుకు ఆ ఏజెన్సీకి దక్కేలా చర్యలు చేపడుతున్నారని సమాచారం. గతంలో మెడికల్ కళాశాలకు కేటాయించిన ఏజెన్సీల అర్హతలు పరిశీలిస్తే ఏ రకంగా కుట్రలు పన్ని ఉద్యోగాలను అమ్మకాలకు చూస్తున్నారనేది బట్టబయలు అయ్యే అవకాశం లేకపోలేదని పలువురు నిరుద్యోగుల సంబంధికుల నుంచి అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

నేడు ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీ

- కామారెడ్డిలోని సరస్వతి శిశుమందిర్ మైదానంలో నిర్వహణ
- జిల్లాలోని మహిళలందరూ పోటీలకు ఆహ్వానితులే..

కామారెడ్డి టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)' వారి ఆధ్వర్యంలో ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ మైదానంలో ముత్యాల ముగ్గుల పోటీలు జరగనున్నాయి. ఉదయం 9 గంటలకు ఈ పోటీలు ప్రారంభం అవుతాయి. ఈ ముగ్గుల పోటీల్లో ప్రతిభ చాటిన వారికి నగదు బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుంది. మొదటి నగదు బహుమతి రూ.6వేలు, రెండో బహుమతి రూ.4వేలు మూడో బహు మతి రూ.3వేలు గెలుపొందిన వారికి అందించడం జరుగుతుంది. ముగ్గులు వేయడం పూర్తయ్యాక న్యాయ నిర్ణేతలు విజేతలను ప్రకటిస్తారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే ముగ్గుల పోటీకి వైభవ్ ఎలైట్ టౌన్‌షిప్, జ్యోతినగర్ వెంచర్, రాధిక మెస్ స్పాన్సర్‌లుగా వ్యవహరిస్తున్నారు. ఈ ముత్యాల ముగ్గుల పోటీకి కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తారు.

జిల్లా స్థాయి ట్యాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ

కామారెడ్డి టౌన్, జనవరి 4: (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆర్కే కళాశాలలో జిల్లా స్థాయి ట్యాలెంట్ టెస్ట్‌ను నిర్వహించినట్లు డీఈవో రాజు తెలిపారు. శనివారం జిల్లా స్థాయి ట్యాలెంట్ టెస్ట్‌లో పలువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని అన్నారు. ఇందులో సహస్ర, శ్రీకాంత్ రెడ్డి, బినుత్న, రేవతి, ప్రత్యూష, శరణ్య, గాయత్రి, పావని, సాయిశివానందరెడ్డిలు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్కే గ్రూప్ కళాశాలల సీఈవో డాక్టర్ జైపాల్‌రెడ్డి, నవీన్, దత్తాద్రి తదితరులు పాల్గొన్నారు.

31 నుంచి ఇంటర్ ఇంగ్లిష్ ప్రాక్టికల్స్

- ప్రభుత్వ కళాశాలల్లో ఎంసెట్, నీట్, జేఈఈ ప్రత్యేక తరగతులు
- ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి శేఖ్ సలామ్



లింగంపేటలో విద్యార్థులను ప్రశ్నిస్తున్న ఇంటర్ జిల్లా నోడల్ అధికారి శేఖ్‌సలామ్

లింగంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ఇంగ్లిష్ ప్రాక్టికల్స్ జనవరి 31 నుంచి ప్రారంభమవుతాయని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి శేఖ్‌సలామ్ అన్నారు. ఆయన శనివారం లింగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఉదయం స్టడీ అవర్స్‌ను తనిఖీ చేశారు. ఉదయం విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. ప్రతీ కళాశాలలోను ఉదయం 9 గంటలకే స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామని ఆయన తెలియజేశారు. ఇంటర్మీడియట్ ఇంగ్లిష్ ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్ ఈనెల 31న మొదటి సంవత్సరం, ఫిబ్రవరి 1న ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహిస్తామని ఆయన తెలియజేశారు. ఈనెల 29న నైతికత మానవ విలువలు కేవలం బ్యాక్‌లాగ్ విద్యార్థులకు మాత్రమే, మొదటి సంవత్సరం విద్యార్థులందరికి 30న పర్యావరణ పరిరక్షణ పరీక్షలు ఉంటాయని ఆయన తెలియజేశారు. ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు ఫిబ్రవరి 9 నుంచి 22 వరకు ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయని ఆయన తెలియజేశారు. అన్ని ప్రభుత్వ కళాశాలల్లో ఎంసెట్, నీట్, జేఈఈ ఎంట్రెన్స్‌లకు సంబంధించిన ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు. విద్యార్థులకు కమిషనర్ సూచనల మేరకు 90 డేస్ ప్రణాళిక ప్రకారం అధ్యాపకులు బోధన చేయాలని ఆయన సూచించారు. 100 శాతం ఉత్తీర్ణతకు విద్యార్థులను సిద్ధం చేయాలని ఆయన తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతీ కళాశాలలోను విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహిస్తున్నామని దీంతో విద్యార్థుల హాజరు శాతం పెరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నరెందర్, లెక్చరర్లు శివ, రాజయ్య, నాగు, స్వామిగౌడ్, ధర్‌సింగ్, అంజమ్మ, శ్రీలత, వాణి, శ్రీకాంత్, అభినవ్, నాగయ్యలతో పాటు లెక్చరర్లు విద్యార్థులు ఉన్నారు.

జిల్లాను వణికిస్తున్న చలి

- జిల్లాలో మళ్లీ పెరిగిన చలి తీవ్రత
- పడిపోయిన కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- డొంగ్లీలో అత్యల్పంగా 6.8 డిగ్రీల ఉష్ణోగ్రతల నమోదు
- జిల్లా అంతటా పెరిగిన చలి తీవ్రత



కామారెడ్డిలో మంచుకురుస్తున్న దృశ్యం

కామారెడ్డి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జిల్లాను చలిపులి వణికిస్తోంది. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. డోంగ్లీలో అత్యల్పంగా కనిష్ఠ ఉష్ణోగ్రత 6.8 డిగ్రీలుగా నమోదైంది. జిల్లా అంతటా ఇదే పరిస్థితి నెలకొంది. చలి పెరిగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు అస్తమా పేషంట్లు చలి తీవ్రతతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. మొన్నటిదాక తుపాన్ ప్రభావంతో చలి తగ్గి కాస్త ఉపశమనం పొందిన ప్రజలు గత రెండు, మూడు రోజుల నుంచి మళ్లీ ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారు జామునే పనులకు వెళ్లే మున్సిపల్ కార్మికులు, పేపర్‌బాయ్స్‌తో పాటు వ్యవసాయ పనులకు వెళ్లే వారు చలితో వణుకుతున్నారు. ఉదయం 9 గంటల వరకు మంచుకురుస్తోంది. చల్లటి ఈదురుగాలులు వీస్తున్నాయి. ఎండ వచ్చినా చలి తీవ్రత తగ్గడం లేదు. సాయంత్రం 5 గంటలకే చలి తీవ్రత పెరుగుతోంది. పొద్దున, సాయంత్రం చలి మంటలు కాచుకుంటూ చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు.

ఫటా..ఫట్...

సీఎంఆర్ ఇవ్వని రైస్‌మిల్లులపై క్రిమినల్ కేసులు

- జిల్లా సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మేనేజర్ రాజేందర్



ప్రశ్న: సీఎంఆర్ రైస్ ఇవ్వని రైస్ మిల్లులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: సీఎంఆర్ కేటాయింపుపై నేరుగా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పర్యవేక్షిస్తున్నారు. ప్రతిరోజూ రైస్‌మిల్లర్లు సీఎంఆర్ రైస్ పెట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల సీఎంఆర్ పెట్టని ఇద్దరు రైస్‌మిల్లర్లపై క్రిమినల్ కేసులు పెట్టడంతో పాటు ఎఫ్ఐఆర్ నమోదు చేశాం.

ప్రశ్న: సీఎంఆర్ ఎంత పెండింగ్ ఉంది?

జవాబు: జిల్లాలో 2023-24కు సంబంధించి వానాకాలం యాసంగి సీజన్‌ల బియ్యం మిల్లర్ల నుంచి రావాల్సి ఉంది. వానాకాలంకు సంబంధించి 2,97,858 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఇవ్వాల్సి ఉండగా 2.80లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌ను మిల్లర్లు తిరిగి అప్పగించారు. 17,850 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉంది.

ప్రశ్న: యాసంగి సీఎంఆర్ ఎంత రావాల్సి ఉంది?

జవాబు: యాసంగి సీజన్‌కు సంబంధించి 1.32 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ మిల్లర్ల నుంచి రావాల్సి ఉంది. ఆ సీజన్‌లో 2.02 లక్షల మెట్రిక్ టన్నులు మిల్లర్లు ఇవ్వాల్సి ఉండగా 70,284 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఇచ్చారు.

ప్రశ్న: ఈ వానాకాలం సీజన్‌లో ఎంత ధాన్యం కొనుగోలు చేశారు.

జవాబు: 2024-25 వానాకాలం సీజన్‌లో 4,32,00 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 86,749 మంది రైతుల నుంచి కొనుగోలు చేశాం.

ప్రశ్న: ధాన్యం డబ్బులు రైతులకు చెల్లించారా?

జవాబు: రూ.1001 కోట్ల విలువ చేసే ధాన్యాన్ని 86,749 మంది రైతుల నుంచి కొనుగోలు చేయడం జరిగింది. ఈ ధాన్యం డబ్బులను మొత్తాన్ని అందరి రైతుల ఖాతాలో జమ చేశాం.

(ఆంధ్రజ్యోతి - కామారెడ్డి)

ఫటా..ఫట్...

కొత్త చట్టాలను ప్రజల్లోకి తీసుకెళుతున్నాం

● మద్నూర్ ఎస్సై విజయ్‌కొండ



కొత్త చట్టాలతో ప్రజలకి సమర్థవంతంగా సత్వర సేవలు అందించే అవకాశం ఉందని వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పిస్తున్నామని మద్నూర్ ఎస్సై విజయ్ కొండ అన్నారు.

ఆంధ్రజ్యోతి: గతఏడాది జూలై నుంచి అమలవుతున్న కొత్తచట్టాలపై ఎలా ముందుకు వెళుతున్నారు?

ఎస్సై: గతఏడాది జూలైఒకటి నుంచి కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయి. ఆచట్టాలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: కొత్త చట్టాలు ఏపేర్లతో పిలుస్తున్నారు.

ఎస్సై: దేశంలో గత ఏడాది అమలులోకి వచ్చిన కొత్త చట్టాలను భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష, సంహిత, భారత సక్ష, అదినియం అను మూడు చట్టాలపై మహిళలకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: కొత్తచట్టాలతో ప్రజలున్యాయం జరుగుతుందా?

ఎస్సై: కొత్త చట్టాల ద్వారా కేసుల దర్యాప్తులో వేగం, బాధితులకు సత్వవర న్యాయం, లభిస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి: మద్నూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కువగా ఎటు వంటి ఫిర్యాదులు వస్తున్నాయి?

ఎస్సై: ఉమ్మడి మద్నూర్ మండలంలో అధికంగా ఇరుగు, పొరుగు వారి భూతగాదాలు, ప్రేమ పెళ్ళిళ్ల, సమస్యలు వస్తున్నాయని, ఫిర్యాదు తీసుకొని కౌన్సిలింగ్ ద్వారా భూతగాదాల సమస్యలు పరిష్కరిస్తున్నామని పరిష్కారం కాని కేసులను సివిల్ కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని, దరఖాస్తుదారులకు సూచిస్తున్నాం. ప్రేమ పెళ్లిళ్ల విషయంలో మేజర్ ఉన్న వారికి సహకరిస్తూ మైనర్ ఉన్నట్లయితే కేసులు నమోదు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మహారాష్ట్ర పోలీసులతో మన సంబంధాలు ఎలా ఉన్నాయి?

ఎస్సై: మహారాష్ట్ర తెలంగాణ పోలీసులు ఫ్రెండ్లీగా ఉంటూ కేసుల విషయంలో ఒకరికొకరు సహకారాలు అందించుకుంటున్నాం. అక్కడ మన వారు చేసిన కేసులపై వారికి సహకరిస్తున్నాం. మన వారు అక్కడ చేసిన కేసులపై మనకు వారు పూర్తి సహకారం అందిస్తున్నారు.

● (ఆంధ్రజ్యోతి, మద్నూర్)

ఎంఆర్‌పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

ఆర్మూర్‌టౌన్, జనవరి4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అరుంధ తి నగర్‌లో ఎంఆర్‌పీఎస్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎంఆర్‌పీఎస్ మండల కో ఇన్‌చార్జీ శ్యామ్‌మాదిగ తెలిపారు. అరుంధతినగర్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షునిగా జంగం గోపి, ఉపాధ్యక్షుడిగా బాలగణేష్, ప్రధానకార్యదర్శిగా మైదం రాములు, కార్యవర్గసభ్యులుగా కె.మనోహర్, టి.అభినవ్, నితిష్, శ్రీధర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెయ్యి గొంతులు లక్ష డప్పులు అనే కార్యక్రమంలో భాగంగా ఈనెల 7న జిల్లాలో జరిగే డప్పు కళాకారుల సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన హామీ ప్రకారం ఎస్సీవర్గీకరణ అమలు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌నాయకులు మురళీకృష్ణ,మైలారాం రాములు,అరుంధతి పాల్గొన్నారు.

మెండోరాలో మధ్యాహ్న భోజనం తనిఖీ

భీమ్‌గల్‌రూరల్, జనవరి4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మెండోర గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఈవో స్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలో తొలిమెట్టుకు సంబంధించిన రికార్డులను పరిశీలించి తరగతి గదిలో విద్యబోదిస్తున్న తీరును పరిశీలించి సెలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు తెలియ.. అలాగే విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట పాఠశాల హెచ్‌ఎం ముత్తెన్న, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి చోరీ



చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్

సాలూర,జనవరి4(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామంలో వ్యవసాయ పనులకు ఉపయోగపడే ట్రాన్స్‌ఫార్మర్ వైర్లను కట్‌చేసి గుర్తు తెలియని దొంగలు ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి అందులో ఉన్న విలువైన సామాగ్రిని ఎత్తుకెళ్లారు. స్థానిక రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామని బోధన్ రూరల్ ఎస్సై తెలిపారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్టు

ఆర్మూర్‌టౌన్, జనవరి4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దూదేకుల కాలనీలో 13మంది కోడి పందెం రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. తెలిసిన సమాచారం మేరకు కోడి పందెలు ఆడుతున్న స్థావరంపై దాడి చేసి 13మంది కోడి పందేలరాయుళ్ళతో పాటు రూ.7380 నగదు, 11సెల్‌ఫోన్‌లు, నాలుగు పందెం కోళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడిలో జమీందర్ తిరుపతి, కానిస్టేబుళ్లు ఆనంద్, అశోక్, శీను, సురేందర్‌లు పాల్గొన్నారు.



కోడిపందెంరాయుళ్ల వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ

సెప్టిక్ ట్యాంక్‌పై కప్పును ఏర్పాటు చేసిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎల్లారెడ్డి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారెడ్డి గ్రామ పంచాయతీ సెప్టిక్ ట్యాంక్ నిండి మురుగు నీరు బయటకు రావడంతో దుర్వాసనతో ప్రమాదకరంగా ఉందని డిసెంబరు 31న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఎన్నాళ్ళీ దుర్వాసన అనే కథనానికి జిల్లా స్థాయి అధికారులు మండల అధికారులకు షోకాస్ నోటీసులు ఇవ్వడంతో అధికారులు స్పందించి సెప్టిక్ ట్యాంకుపై కప్పును ఏర్పాటు చేశారు. దీంతో సమస్య పరిష్కారమైందని గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.



సెప్టిక్ ట్యాంకుపై కప్పును ఏర్పాటు చేసిన సిబ్బంది

ప్రభుత్వం రైతులను మోసం చేసే ప్రయత్నం చేస్తోంది

● బీఆర్ఎస్ జిల్లా రైతు నాయకుడు మిట్టపల్లి మహిపాల్



అంక్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా రైతు నాయకుడు మిట్టపల్లి మహిపాల్

వేల్పూర్, జనవరి4(ఆంధ్రజ్యోతి): దేశానికి అన్నంపెట్టే రైతులను ఆదుకోవాల్సింది పోయి రైతు భరోసా పథకానికి నిబంధన అంటు కాలయాపన చేస్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్నదాతలకు మోసం చేసే ప్రయత్నం చేస్తుందని బీఆర్ఎస్ జిల్లా రైతు నాయకుడు మిట్టపల్లి మహిపాల్ ఆరోపించారు. శనివారం మండలంలోని అంక్సాపూర్ గ్రామంలో రుణమాఫీ రాని రైతులతో కలిసి రైతు భరోసాపై ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. రైతు భరోసా పథకానికి కూడా మళ్ళీ దరఖాస్తులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం బాధకరమన్నారు. ఇప్పటికే ప్రజాపాలన పేరిట ఇంటింటికి సర్వే చేస్తూ దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం ఇంక ఎన్ని సార్లు దరఖాస్తులు తీసుకుంటారని ప్రశ్నించారు. ఏడాది గడిచిన రైతు భరోసాకు రైతులు నోచుకోకపోవడంతో పంట పెట్టుబడికి ఇబ్బందులు పడ్డారన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయంలో రైతు బంధు సర్వే ప్రతీ రైతు డేటా ఉందో దాని ప్రకారమే రైతులకు ఏలాంటి షరతులు లేకుండా రైతు బంధు చెల్లించడం జరిగిందన్నారు. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతు భరోసా పథకంలో డబ్బులు తగ్గించాలని చేస్తున్న బూటకపు నాటకమన్నారు. రూ.2 లక్షల రుణమాఫి ఇస్తామని చెప్పి మోసపూ రిత వాగ్దానాలు, మాయమాటలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రుణమాఫీ చేయడంలో రైతులకు అన్యాయం చేస్తుందన్నారు. ప్రతీ గ్రామంలో కేవలం 10నుంచి 15శాతం రైతు లకు మాత్రమే రుణమాఫీ జరిగిందని, మిగతా రైతులకు రుణమాఫీ జరగలేదన్నారు. ప్రతీ విషయం లో రైతులను పట్టించుకోకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, రాబోయే స్థానిక ఎన్నికల్లో రైతులంత ఏకమై కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలి

బోధన్‌రూరల్,జనవరి4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థులు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఆర్టీఏ, లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్, అపెక్స్ వైటల్ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఏసీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయని ప్రతి ఒక్కరుచట్టాలపై అవగాహన కలిగిఉండాలన్నారు. సీటు బెల్టు, హెల్మెట్‌లు తప్పకుండా ధరించాలన్నారు. సిగ్నల్స్ సూచనలను పాటించాలన్నారు. అతివేగం ప్రమాదకరమని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇచ్చేటప్పుడు జాగ్రత్తలు సైతం చెప్పాలన్నారు. అనంతరం మధుమలాంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షీటీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలపై జరిగే నేరాల గురించి టీ సెఫ్ యాప్, డయల్ 100, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ వెంకట నారాయణ, ఎంవీఐ శ్రీనివాస్, ఆర్టీసీ డీఎం శ్రీనివాస్, లయన్స్ శ్రీనివాస్, జోనల్ చైర్మన్ లయన్ లంక రవి, సభ్యులు నాగభూషణం, ప్రిన్సిపాల్ బాలచంద్రం, పీ.నాగేష్ బాబు, సుధాకర్ రెడ్డి, నెమిలి సంజీవ్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు భద్రత మహోత్సవాల్లో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు

ముప్కాల్: ముప్కాల్ మండల కేంద్రంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రతీఒక్కరు హెల్మెట్ ధరించాలని, నియమ నిబంధనల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్సై సురేష్, ఆర్డీవో అధికారులు, స్థానిక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

కమ్మర్‌పల్లి, జనవరి 4: (ఆంధ్రజ్యోతి)ప్రభుత్వం, దాతలు అందజేస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటు శ్రద్ధతో చదివి ఉత్తమ విద్యార్థులుగా రాణించాలని రాబోవు వార్షిక పరీక్షలు ఇప్పటి నుండే సిద్ధం కావాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజా శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని కోనాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థులకోసం ఆపాఠశాల హెచ్‌ఎం రాంప్రసాద్ రూ.4వేల ఇచ్చి తయారు చేసిన గణిత స్టడీ మెటీరియల్ పుస్తకాలను పాఠశాలకు చెందిన 25 మంది పదోతరగతి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ఎస్‌సీఆర్టీ తెలంగాణ సంస్థ విడుదల చేసిన మార్చి 2025 ఎస్సెస్సీ పరీక్షల బ్లూప్రింట్‌కు అనుగునంగా తెలంగాణ గణిత ఫోరంరాష్ట్ర అధ్యక్షుడు కంది కొండ శ్రీనివాస్, నిష్ణాతులైన ఉపాధ్యాయులు గణిత స్టడీమెటీరియల్ తయారు చేశారని 60 రోజుల్లో పదోతరగతికి అన్ని పాఠ్యాంశాలు, విద్యాప్రమాణాలు పూర్తి అగునట్లు విద్యార్థులు సన్నద్ధం కావాలని అన్నారు. నూతన ప్రశ్న పత్రం నమూనకు అనుగుణంగా విద్యార్థుల తక్కువ సమయంలో ఎక్కువ మార్కులు వచ్చే విధంగా గణితాన్ని ప్రాక్టీస్ చేయడంద్వారా 10 జీపీఏ సాధించ వచ్చన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నతశ్రేణిలో మార్కులు సాధించి ట్రిబల్‌ఐటీలో సీట్లు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



కోనాపూర్‌లో విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేస్తున్న ఎంపీడీవో

పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలి



రుద్రూరులో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కోటగిరి,జనవరి4(ఆంధ్రజ్యోతి):బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని రుద్రూరు మండల బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మధు పేర్కొన్నారు. రుద్రూరు మండలకేంద్రంలో శనివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాన్సువాడ నియోజకవర్గానికి ఎమ్మెల్సీ కవిత బాధ్యతలను నియమించిందన్నారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన మాత్రనా బీఆర్ఎస్ పార్టీకి నష్టమేమి లేదన్నారు. పార్టీలో నాయకులు లేనంత మాత్రాన కార్యకర్తలు నిరుత్సాహం చెందవద్దన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలలో బీఆర్ఎస్ సత్తా చాటడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిలు, శివ, సాయి కిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించాలి

● టీపీసీసీ అధ్యక్షుడిని కోరిన హరిప్రసాద్



టీపీసీసీ అధ్యక్షుడిని కలిసి టీయూపీసీఎంఏ నాయకులు

బోధన్‌రూరల్,జనవరి4(ఆంధ్రజ్యోతి): గతమూడు సంవత్సరాలుగా డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందాల్సిన ఉపకార వేతనాలు, బోధన రుసుములు విడుదల కానందున రాష్ట్రంలోని, జిల్లాలోని ప్రైవేటు కళాశాలలు ఆర్థికంగా అనేక కష్టాలు ఎదుర్కొంటున్నాయని రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని శనివారం రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను టీయూపీసీఎంఏ అధ్యక్షులు హరిప్రసాద్, కార్యవర్గ సభ్యులు అరుణ్ కుమార్, సృజన్ రెడ్డి, రవి పటేల్ కోరారు. ప్రైవేటు కళాశాలల సమస్యలను సవివరంగా వివరించి బోధన రుసుము, ఉపకార వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు సానుకూలంగా స్పందించారని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల,జనవరి 4 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు మ హేష్ కుమార్ గౌడ్‌ను శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్య క్షుడు శివన్నోల్ల శివకుమార్, టీపీ సీసీ అధికార ప్రతినిధి వేణు గోపాల్ యాదవ్‌లు హైదరాబాద్ లోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియ జేశారు. అలాగే జిల్లా కేంద్రంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కలిసి శాలు వాతో సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్య ర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు సూచించారన్నారు.

మాజీమంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఆర్మూర్‌టౌన్, జనవరి4(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి శనిగరం సంతోష్‌రెడ్డిని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన శుభకాంక్షలు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని సంతోష్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్ నాయకులు కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగితెలుసుకున్నారు. మాజీమంత్రిని కలిసిన వారిలో మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ సడాక్ వినోద్, నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు విజయ్‌అగర్వాల్, అల్జాపూర్ కిరణ్, నర్మే ప్రవీన్, తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి ఆలయంలో సహస్ర కుంకుమార్చన

బోధన్‌రూరల్,జనవరి4(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామంలోని శ్రీ మహలక్ష్మి ఆలయంలో మహిళలు సహస్ర కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య సహస్ర కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహలక్ష్మి మందిరం కమిటీ చైర్మన్ పోతారెడ్డి, వీడీసీ చైర్మన్ లక్ష్మారెడ్డి, సొసైటీ చైర్మన్ రాజారెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్, కృష్ణారెడ్డి, సంతోష్, నాగరాజు, పోతయ్య, అశోక్, సాయిలు, సుదర్శన్ రెడ్డి, నారాయణరెడ్డి, నాగభూషణం రెడ్డి, గణేష్, లింగారెడ్డి, సాయిలు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం అందజేయాలి

కోటగిరి,జనవరి4(ఆంధ్రజ్యోతి): 10వ తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించాలని బీజేపీ నాయకులు భజరంగ్ డిమాండ్ చేశారు. పొతంగల్ ఎంఈవో శంకర్‌కు శనివారం ఈ విషయమై స్థానిక నాయకులు, విద్యార్థులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నవంబర్ నెల నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, సాయిలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ముప్కాల్, జనవరి4(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని వివిధ గ్రామాల్లో బాధిత కుటుంబాలను శనివారం బాల్కొండ నియోజకవర్గ కాం గ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. మండలం లోని వన్నెల్(బి) గ్రామంలో దేవ గంగన్న వల్ల అమ్మ అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబాన్ని, చిట్టాపూర్‌లో కాంగ్రెస్ కార్యకర్త దమ్మడి పవన్ వల్ల నాన్న దమ్మడి సాయన్న ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబాన్ని, అలాగే చిట్టాపూర్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు శేషు వల్ల అమ్మరత్న అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబాలను సునీల్‌కు మార్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

● బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ముత్యాల సునీల్

ఏర్గట్ల: మండలంలోని తొర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త నవదీప్ తండ్రి ఇటీవలె మృతి చెందగా శనివారం బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో భూమేశ్వర్, కాంగ్రెస్ నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి సైన్స్ క్విజ్‌లో ప్రతిభకనబర్చిన విద్యార్థులు

ముప్కాల్, జనవరి4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ క్విజ్ పోటీల్లో బాల్కొండ కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్టు ప్రిన్సిపాల్ విజయ్‌కర్తన్ తెలిపారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ నిజామాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాదకద్రవ్య, మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన సైన్స్ క్విజ్ పోటీల్లో టాప్ 10లో ప్రవని, స్నేహలు నిలిచారు. బాల్కొండ కృష్ణవేణి పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

డొంకేశ్వర్, జనవరి4(ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో బాధపడుతూ సీఎంఆర్ఎఫ్ ద్వారా లబ్ధిపొందాలని డొంకేశ్వర్ మండల అధ్యక్షుడు భూమేష్ రెడ్డి అన్నారు. శనివారం డొంకేశ్వర్ జీపీలో పొద్దుటూరి రమణారెడ్డికి మంజూరైన రూ.20వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అశోక్, గోపి, వంశీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళకు రక్తదానం

ఆర్మూర్‌టౌన్, జనవరి4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంతోష్‌నగర్‌కాలనీకి చెందిన రజిత అనే పేద మహిళకు సైదు నరేష్ వెల్ఫేర్ సొసైటీకి చెందిన సభ్యులు రక్తదానం చేశారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రజితకు ఓపాజిటివ్ రక్తం తక్కువగా ఉండడంతో విషయం తెలుసుకున్న వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సైదు రమేష్, సొసైటీ సభ్యుడు తెడ్డు నగేష్ జిల్లా కేంద్రానికి వెళ్ళి రక్తదానం చేయడంతో పలువురు అభినందించారు.

కలెక్టర్‌ను కలిసిన టీఎన్‌జీవోస్ నాయకులు



టీఎన్‌జీవోస్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

భీమ్‌గల్‌రూరల్, జనవరి4(ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ యూనిట్ టీఎన్‌జీవోస్ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు కుంట శ్రీనివాస్, పురస్తు నరేష్‌లు శనివారం జిల్లా సమీకృత కార్యాల యంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్, ఉపాధ్య క్షుడు మాణిక్యం ఆధ్వర్యంలో కలెక్టర్ చేతుల మీదుగా టీఎన్‌జీవోస్ క్యాలెండర్; డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎడెల్లిరవి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ఆర్మూర్‌టౌన్,జనవరి4(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రభుత్వ పాఠ శాలల్లో మున్సిపల్ కమిషనర్ రాజు శనివారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికులకు మెను ప్రకారం భోజనం అందించాలని సూచించారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని 21, 22వార్డులలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల రీ వెరిఫికేషన్‌ను పరిశీలించారు.ఆయన వెంట మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

ఆర్మూర్‌రూరల్, జనవరి4(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం పిప్రి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో డెమోక్రాటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ఆర్మూర్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా అధ్యక్షుడు బాలయ్య, ఉపాధ్యక్షులు రాసరి పెంటన్న, దాసు ఎన్నికల పరిశీలకులుగా హాజరయ్యారు. డీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడిగా డి.విజయ్‌కుమార్, ప్రధానకార్య దర్శిగా ఏక్‌నాథ్, ఉపాధ్యక్షుడిగా అనసూయ,చక్రధర్, కార్యదర్శిగా అంజాద్‌లను ఎన్నుకు న్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, డీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

సోషల్ టాలెంట్ షోలో అంక్సాపూర్ విద్యార్థి ప్రతిభ



అభినవ్‌కు మెమోంటో అందజేస్తున్న డీఈవో

వేల్పూర్,జనవరి4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో శనివారం నిజామాబాద్‌లో జరిగిన జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ షోలో అంక్సాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి జి.అభినవ్ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా డీఈవో అశోక్ చేతుల మీదుగా అభినవ్‌కు మెమెంటో, ప్రశంసపత్రాన్ని అందజేశారు. ఈ టాలెంట్‌షోలో ప్ర తిభ కనబరిచిన అభినవ్‌ను హెచ్‌ఎం మల్లేశ్వరి, ఉపాధ్యాయులు సదాశివ్, రవిచందర్, అభినందించారు.

రుద్రూరులో గాంధీ విగ్రహం ధ్వంసం



విగ్రహాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

కోటగిరి,జనవరి4(ఆంధ్రజ్యోతి):రుద్రూరు మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద గల మహాత్మ గాంధీ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గాంధీ విగ్రహం చెయ్యి విరగగొట్టి అవమానపర్చారన్నారు. గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

మెండోర, జనవరి4(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2025సంవత్సరం యూటీఎఫ్ నూతన క్యాలెండర్, డైరీని శనివారం యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్, ఎంపీడీవో వనజ, ఎంఈవో శ్రీనివాస్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం నూతన క్యాలెండర్‌ను ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ప్రధానకార్యదర్శి ప్రభాకర్, రమేష్, యుటీఎఫ్ నాయకులు రాజేశ్వర్, విజయలక్ష్మీ, రాజేందర్ పాల్గొన్నారు.

నూతన చట్టాలపై పోలీసులకు అవగాహన

ఆర్మూర్‌టౌన్, జనవరి4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోర్టు ఆవరణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.రామకృష్ణ శనివారం పోలీసులకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం 2023పై పోలీసు అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, డిచ్‌పల్లి సీఐ మల్లేష్, భీమ్‌గల్ సీఐ నవీన్ కుమార్, ఎస్సైలు రాము, అనిల్, నరేష్, మహేష్, రజనీకాంత్, తిరుపతి, నారాయణ, చిరంజీవి, కోర్టు అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తల మృతి

నవీపేట,జనవరి4(ఆంధ్రజ్యోతి):నవీపేట మండల కేంద్రంలోని మిషన్ భగీరథ ట్యాంకు సమీపంలో బాసర ప్రధాన రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి నవీపేట ఎస్ఐ వినయ్ వివరాలు వెల్లడించారు. మండలంలోని ఫకీరాబాద్‌కు చెందిన భార్యభర్తలు మగ్గడి లక్ష్మణ్(57), మగ్గడి రాజమణి(52) దంపతులు శుక్రవారం రాత్రి కూలీ పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెనుక నుండి వచ్చిన లారీ ఢీకొనడంతో ప్రమాదస్థలంలోనే భార్యభర్తలు మృతి చెందారన్నారు. బాసర వైపు నుంచి నిజామాబాద్ వైపు వస్తున్న లారీ ఢీకొందన్నారు.ప్రమాదంలో భార్యభర్తలు ఒకేసారి మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నామన్నారు. మృతదేహలను పోస్టు మార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించామన్నారు.

సామాజిక సేవకుడికి సన్మానం



తులసీకుమార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, జనవరి4(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో ఆర్మూర్ పట్టణానికి చెందిన సమాజ సేవకుడు పట్వారి తులసీ కుమార్‌ను శనివారం ఎమ్మెల్యే పైడిరాకేష్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. తులసీకుమార్ చేస్తున్న సేవలను గుర్తించి ఖమ్మం జిల్లా వారు భారత్ సేవ రత్న పురస్కారాన్ని అందజేశారు. దీంతో ఎమ్మెల్యేను ఆయనను సన్మానించారు. ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ సేవభావంతో పని చేయడం అభినందనీయమన్నారు. నేటి యువతరం, విద్యార్థులు ఇలాంటి సేవ భావాన్ని అలవర్చుకొని ఇతరులకు సేవ చేయాలని సూచించారు.ఈకార్యక్రమంలో పట్వారి గోపికృష్ణ, జెస్సుఅనిల్, పొల్కంవేణు, యామాద్రి భాస్కర్,గోపి పాల్గొన్నారు.

● ఎస్‌జీటీయూ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

ఆర్మూర్ మండలంలోని అంకాపూర్ గ్రామంలో మండల ఎస్‌జీటీయూ శాఖ నూతన క్యాలెండర్, టేబుల్ క్యాలెండర్‌ను శనివారం ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీటీయూ మండల అధ్యక్షుడు పొన్నం ప్రవీన్, ప్రధానకార్యదర్శి అర్విండ్‌కుమార్, వసంత్, గంగారాం, ప్రదీప్‌రాజ్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

జర దేఖో!!



మూతపడ్డ బాల్కొండ ఆర్టీసీ బస్టాండ్

నిరుపయోగంగా బాల్కొండ ఆర్టీసీ బస్టాండ్

● పేరుకే నియోజకవర్గ కేంద్రం ● పట్టింపు కరువు

ముప్కాల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రంలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ వినియోగం లేక నిరుపయోగంగా మారింది. 1991లో అప్పటి ఎమ్మెల్యే ప్రస్తుత రాజ్యసభ మెంబర్ కేఆర్.సురేష్‌రెడ్డి హయాంలో నిర్మించిన బస్టాండ్ కళ తప్పింది. కొన్నాళ్ల వినియోగంలోకి వచ్చిన బస్టాండ్ హైవే రోడ్డు ఏర్పడ్డాక అటు వైపు బస్సులు వెళ్ళలేదు. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ప్రాంతం కలవిహీనంగా తయారైంది. వినియోగం లేక అసాంఘీక కార్యకలాపాలకు అడ్డగా మారింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ సమయంలో గోదాం ఏర్పాటుకు ఈ బస్టాండ్‌ను వాడుకోవాలని రైతుల నుంచి విజ్ఞప్తులు వచ్చాయి. నేషనల్ హైవే రోడ్డుపై గోదాం ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న పట్టించుకోలేదని రైతులు అంటున్నారు. ఆధునీకరణ చేసి బస్టాండ్‌ను వినియోగంలోకి తేవాలని పలుమార్లు గ్రామస్థులు విన్నవించినా పట్టించుకున్న వారేలేరు. బస్టాండ్ లేక ప్రయాణికులు రోడ్డుపై గంటల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వాహనాల రద్దీ ఉండంతో కొన్ని సార్లు బస్సులు ఆపడంలేదు. అయిన ప్రయాణికులకు కనీస వసతులు లేవు. ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ బస్సుల కోసం ఎదురుచూఅల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్డుపై బెంచీలు, షెల్టర్ లేక పిల్లల నుంచి వృద్ధులు, గర్భిణులు ఇబ్బందిపడుతున్నారు. బస్టాండ్ వాడుకలోకి తెస్తే నిజామాబాద్ నుంచి ఆదిలాబాద్ వచ్చి వెళ్లే ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఇదే విషయంపై ఇటీవల బాల్కొండ ఖిల్లా పరిరక్షణ సమితి ప్రెసిడెంట్ బీఆర్ నర్సింగ్‌రావు, సీఎం ఆఫీస్‌లో విజ్ఞప్తి చేసినట్టు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి ఆర్టీసీ బస్టాండ్‌ను వాడుకలోకి తేవాలని కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన బస్టాండ్

సంక్రాంతి పతంగులొచ్చేశాయ్..

● వివిధ రూపాల్లో ఆకర్షిస్తున్న పతంగులు ● దుకాణాలకు మొదలైన గిరాకీ
● చిన్నా పెద్ద తేడా లేకుండా పతంగుల ఎగురవేత



విక్రయానికి సిద్ధంగా ఉంచిన పతంగులు

పెద్ద కొడప్‌గల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మరో వారం రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగ మొదలవుతుంది. ఆంధ్ర రాష్ట్రంలో ఈ పండుగకు తెలంగాణ కంటే అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో దేశంలోని ఏ ప్రాంతంలో ఉన్న ఆంధ్ర ప్రజలు తమ స్వస్థలాలకు చేరుకుంటారు. దీంతో పాటుగానే తెలంగాణ రాష్ట్ర ప్రజలు కూడా సంక్రాంతి పండుగకు తమ గ్రామాలకు చేరుకుంటారు. దీంతో పండుగ రోజు పల్లె సీమలన్నీ జనాలతో కిటకిటలాడుతుంటాయి. సంక్రాంతి పండుగకు ఆంధ్రలో కోడి పందాలు, ఇతర ఆటలకు ప్రాధాన్యం ఇస్తే తెలంగాణ రాష్ట్రంలో యువకులు, చిన్నారులు పతంగులు ఎగురవేయడానికి ఆసక్తి కనబరుస్తారు. చిన్నారి మొదలుకుని యువకుల వరకు సంక్రాంతి వచ్చిందంటే చాలు పతంగులు ఎగురవేయడానికి ఇష్టపడుతుంటారు. దీంతో పండుగకు పతంగులు విక్రయించేందుకు దుకాణదారులు గాలిపటాలను అందుబాటులో ఉంచారు. పండుగకు మరో వారం పది రోజుల పాటు సమయం ఉన్న గాలిపటాల గిరాకీలు ఇప్పుడు షురూ అయ్యాయి. దీంతో చిన్నారులు తమ పెద్దల సహాయంతో వచ్చి పతంగులు కొనుగోలు చేస్తున్నారు.

కాగితం గాలి పటాలకు తగ్గిన డిమాండ్..

గతంలో గాలి పటాలను కాగితంతో వివిధ ఆకారాల్లో తయారు చేసేవారు. దీంతో కాగితంతో తయారు చేసిన గాలి పటాలను చిన్నారులతో పాటు యువకులు ఎగురవేసి ఆనందపడేవారు. రాను రాను కాగితం సప్లై తగ్గడంతో పాటు ప్లాస్టిక్‌తో చేసిన గాలి పటాలు ఎక్కువ కాలం చినగకుండ ఎక్కువ కాలం ఉంటాయన్న ఉద్దేశంతో దుకాణదారులు ప్లాస్టిక్ పతంగులకు విక్రయిస్తున్నారు. చిన్నపాటి చినుకులు కురిసిన ప్లాస్టిక్ పతంగులు పాడుకాకుండా ఉండటంతో వినియోగదారులు ప్లాస్టిక్ పతంగుల వైపే చూస్తున్నారు. ఎంత ప్లాస్టిక్ పతంగులు మార్కెట్లోకి వచ్చిన పండుగముందు రోజులు మాత్రం కాగితంతో చేసిన గాలిపటాలకే అధిక ప్రాధాన్యం ఇస్తారని దుకాణదారులు పేర్కొంటున్నారు.

ట్రెండ్‌కు అనుగుణంగా గాలి పటాల తయారీ..

గతంలో గాలి పటాలు తయారుచేసే క్రమంలో కేవలం ఒక రంగు కలిగిన గాలిపటాలను మాత్రమే తయారు చేసి విక్రయించేవారు. అయితే రాను రాను సాంకేతిక పెరగడం, వినియోగదారులు వివిధ రూపాలు కలిగిన గాలి పటాలకు ఆకర్షితులు కావడంతో తయారీ దారులు గాలి పటాలను వివిధ రూపాల్లో తయారు చేసి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం సినిమా ట్రెండ్‌కు అనుగుణంగా గాలి పటాల తయారు జరుగుతుంది. ట్రిపుల్ ఆర్ సినిమా హిరోల బొమ్మలు, దేవ తల బొమ్మలు, కార్టున్స్, 2025 సంవత్సరం లోగో కలిగిన పతంగులు ప్రస్తుతం మార్కెట్లో దర్శనమిస్తున్నాయి.



పతంగులను అమ్మేందుకు ఏర్పాటు చేసిన దుకాణం

రూ.5 నుంచి వందల వరకు గాలి పటాల ధరలు..

ప్రస్తుతం గాలి పటాల విక్రయదుకాణాలలో మండల కేంద్రాలలో రూ.5 మొదలు కుని వందల రూపాయల వరకు ధర కలిగిన గాలి పటాలకు దుకాణదారులు అమ్మేందుకు సిద్ధంగా ఉంచారు. దీంతో పాటుగానే పతంగి ఎగురవేయడానికి కావలసిన దారం రూ.2 మొదలు కుని రూ.100 వరకు అందుబాటులో ఉంచారు. అంతేకాకుండా దారం చుట్టేందుకు కావలసిన చరఖాలు 25 వరకు వివిధ ధరల్లో అందుబాటులో ఉంచినట్లు దుకాణదారులు తెలిపారు. హైదరాబాద్‌తో పాటు ఔరంగాబాద్ లాంటి పట్టణాల నుంచి గాలి పటాలను తీసుకవచ్చి దుకాణాల్లో విక్రయం చేస్తున్నారు. ప్రస్తుతం పండుగకు ఇంకా పది రోజుల పాటు సమయం ఉన్నందున ఇప్పుడిప్పుడే గిరాకీలు షురూ అయ్యాయని దుకాణ దారులు చెబుతున్నారు.



విక్రయానికి ఉంచిన కాగితం పతంగిలు



కృష్ణుడి బొమ్మతో..



ట్రిపుల్ ఆర్ హీరోలతో ముద్రించిన పతంగి



2025 సంవత్సరం లోగోతో పతంగి

జాతీయ స్థాయి క్రీడాకారులను సన్మానించిన ఎమ్మెల్యే

జక్రాన్‌పల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో వివిధ క్రీడల్లో బంగారు పతకాలను సాధించిన జక్రాన్‌పల్లి మండలం పడకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి సన్మానించారు. శనివారం నిజామాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జాతీ యస్థాయి వివిధ క్రీడల్లో ఆడి బంగారు పతకాలు సాధించిన పడకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి శాలువ, జ్ఞాపిక, షీల్డ్‌లతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, పడకల్ పాఠశాల హెచ్ఎం గడ్డం సురేందర్‌రెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్, పడకల్ వీడీసీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులను సన్మానిస్తున్న రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

క్రీడాకారులను సన్మానించిన డీఈవో

జాతీయస్థాయిలో వివిధ క్రీడల్లో తెలంగాణ జట్ల గెలుపు కోసం ఆ దిశలో ఆడి జట్లను గెలిపించిన పడకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులను, విద్యార్థులను శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ సన్మానించారు. అనంతరం జాతీయస్థాయి క్రీడాకారులను శాలువ, జ్ఞాపికతో డీఈవో అశోక్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గడ్డం సురేందర్‌రెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్ దంపతులకు సన్మానం

జాతీయస్థాయి క్రీడల్లో ఆడి తెలంగాణ రాష్ట్ర జట్లను ఆడి బంగారు పతకాలు సాధించిన ఆ దశలో శిక్షణ ఇచ్చిన వ్యాయమ ఉ పాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్ మధుమిత దంపతులను శనివారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి శాలువ, జ్ఞాపికతో సత్కరించారు.

టీజీ ఆర్టీసీ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవాలు



మాట్లాడుతున్న ఎంవీఐ రాహుల్

సుభాష్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో శనివారం రోడ్డు భద్రత మాసోత్సవాలను ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని ఆర్ఎం కార్యాలయం సమావేశ మందిరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్లు రాహుల్, కిరణ్‌కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు మీద ప్రయాణించే ప్రతీఒక్కరు రోడ్డు భద్రతను పాటించాలని అన్నారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపా లన్నారు. ఆర్టీసి డ్రైవర్ల వల్ల ప్రమాదాలు తక్కువగానే జరుగుతున్నాయన్నారు. అనుభవమైన డ్రైవర్లు ఆర్టీసిలో ఉండటం వల్ల ప్రమాదాలు తక్కువగా జరుగుతాయన్నారు. కొందరు అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. మాసోత్సవాల్లో భాగంగా 6వ తేదీన డ్రైవర్లకు, కండక్టర్లకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీవీఎంలు సరస్వతి, శంకర్‌లు తెలిపారు. 8వ తేదీన రక్తదానం, 9వ తేదీన నిర్వహణ దినం, 21న ఫ్యామిలీ కౌన్సెలింగ్, 24న డ్రైవర్ల దినోత్సవం, 28న శిక్షణా రోజు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 31న ఉత్తమ డ్రైవర్లకు, కండక్టర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఆనంద్, సాయన్న, పీవో పద్మజ, ఆర్టీసి అధికారులు పాల్గొన్నారు.

సీఎం కప్ కుస్తీ పోటీల్లో పోచారం యువకుడి ప్రతిభ

పెద్ద కొడప్‌గల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచారం గ్రామానికి చెందిన అనిల్ ఇటీవల హన్మకొండలో నిర్వహించిన సీఎం కప్ కుస్తీ పోటీలలో ద్వితీయ స్థానం సాధించినట్లు గ్రామస్థులు తెలిపారు. పోచారం గ్రామానికి చెందిన అనిల్ తన తండ్రి ప్రోత్సాహంతో కుస్తీ పోటీల్లో మెలుకువ సాధించి రాష్ట్ర స్థాయి సీఎం కప్ కుస్తీపోటీలో రెండవస్థానంలో నిలవడం ఆనందంగా ఉందని అనిల్ తెలిపారు. రానున్న రోజుల్లో జాతీయ స్థాయి కుస్తీ పోటీలలో రాణించడమే తన లక్ష్యమని అనిల్ తెలిపారు.

సర్వలోక రక్షకుడు.. లక్ష్మీనారాయణుడు

భక్తి



ప్రవచనం చేస్తున్న సంపత్‌కుమారాచార్య

నిజామాబాద్ కల్చరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జగద్గురువుగా సర్వలోకాలను రక్షించే రక్షకుడుగా లక్ష్మీనారాయణుడే మనందరికి భగవంతుడు అని ఉభయ వేదాంత పండితుడు సేనాపతి సంపత్‌కుమారాచార్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బ్రహ్మపురి లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆల్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కొనసాగుతున్న గోదాదేవి తిరుప్పావై ప్రవచన కార్యక్రమంలో భక్తులను ఉద్దేశించి ప్రవచనం చేస్తూ గోదాదేవి లక్ష్మీనారాయణుడిని రక్షకుడిగా కొలిచింది అని అన్నారు. నెల రోజుల పాటు రంగనాథున్ని కొలుస్తూనే తన తోటి స్నేహితులతో కలిసి భక్తి పారవశంతో భక్తిపాటలు అందించిందని అన్నారు. ప్రతీరోజు అమ్మవారు రంగనాథుని భైవవాన్ని తన పాశురాలలో తెలియ జేసిందన్నారు. అనంతరం ఆలయంలో గోదాదేవికి అర్చకులు కంధాళై నాగ రాజాచార్య ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రఘురాం, నర్సింహ మూర్తి, హయగ్రీవాచార్య తదితరులు పాల్గొన్నారు.

యాసంగి సాగుకు పోచారం నీటి విడుదల

నాగిరెడ్డిపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): యాసంగి పంటల సాగు కోసం పోచారం ప్రాజెక్టు నీటిని శనివారం జిల్లా నీటి పారుదల శాఖ ఎస్ఈ వద్యావతి, ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్‌లు స్థానిక నాయకులతో కలిసి విడుదల చేశారు. ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 1.820 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 1.595 టీఎంసీలు నీరు నిలువ ఉందన్నారు. ప్రస్తుత యాసంగి పంటల సాగు కోసం ప్రాజెక్టు పరిధిలోని నాగిరెడ్డిపేట మండలం ఏ జోన్‌కు నీటిని అందజేస్తున్నట్లు తెలిపారు. పంటల సాగు కోసం ఐదు విడతలుగా నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఏ జోన్ ఆయకట్టు రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి డీఈ వెం కటేశ్వర్లు, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజిత వెం కటరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, శ్రీధర్‌గౌడ్, నాయకులు రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్ రాగూర్, ఇమామ్, నర్సింహారెడ్డి, పర్వత్‌రావు, కుమార్, ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తయినా అందుబాటులోకి రాని హాస్టల్ భవనం



పూర్తయిన భవనం

మోపాల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కంజర్ గ్రామ శివారులో రూ.9కోట్ల వ్యయంతో నిర్మించిన మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల భవనం పూ ర్తయి రెండు నెలలు దాటుతున్నా హాస్టల్ విద్యార్థులకు అందుబాటులోకి రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎ దుర్కొంటున్నారు. ఈ పాఠశాలలో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు విద్యా బోధనను అందిస్తున్నారు. ఈ పాఠశాలలో సుమారు 424 మంది విద్యా ర్థులు చదువు కుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పూర్తయిన భవనాన్ని హాస్టల్‌కు అందజేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

గ్రామీణ విద్యార్థులు ఉన్నత ఆశయాలను కలిగిఉండాలి

● కాకతీయ సాండ్‌బాక్స్ వ్యవస్థాపకుడు రాజారెడ్డి

సుభాష్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో చదివే విద్యార్థులు ఉన్నత ఆశయాలను కలిగి ఉండాలని కాకతీయ సాండ్‌బాక్స్ వ్యవస్థాపకుడు రాజారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో డ్రగ్స్ విపరీతంగా పెరిగిపోయాయని డ్రగ్స్‌ను అరికట్టేందుకు ప్రతీఒక్కరు పాటుపడాలన్నారు. మరో ముఖ్య అతిథిగా హాజరైన అదనపు డీసీపీ బస్వారెడ్డి మాట్లాడుతూ దేశాన్ని డ్రగ్స్ రహితంగా దేశంగా మార్చాలంటే విద్యార్థి దశ నుంచే అలవాట్ల పట్ల అంకితభావంతో ఉండాలన్నారు. డ్రగ్స్ మహమ్మారితో చాలా కుటుంబాలు చిన్నా భిన్నం అవుతున్నాయని అన్నారు. డ్రగ్స్ వాడకం పట్ల వివేకం కోల్పోయి కేసుల్లో ఇరుక్కుంటున్నారని అన్నారు. దేశంలో 42 శాతం కేసులు డ్రగ్స్ ద్వారానే నమోదు అవుతున్నాయని అన్నారు. అనంతరం విశిష్ట అతిథిగా హాజరైన డాక్టర్ విశాల్ మాట్లాడుతూ మత్తు పదార్థాలను వాడటం వల్ల శరీరంలో అనేక మార్పులు వస్తున్నాయని అన్నారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల ఏం చేస్తున్నారో తెలియని స్థితిలో దారుణాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 71 పాఠశాలల నుంచి సుమారు 552 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అడిషనల్ డిప్యూటీ కమిషనర్ బస్వారెడ్డి క్విజ్ ప్రిలిమినరీ పరీక్ష పత్రం ఆవిష్కరించారు. విద్యార్థులకు 25 మార్కులకు పరీక్ష నిర్వహిం చారు. అనంతరం కాకతీయ సాండ్‌బాక్స్ వ్యవస్థాపకులు ప్రిలిమి నరీ పరీక్షలో ప్రతిభచూపిన 6 పాఠశాలలకు చెందిన 12 మంది విద్యార్థులకు ఫైనల్ క్విజ్ నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. మత్తు పదార్థాలపై అవగాహన నిర్వహించడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలన్నారు. ఫైనల్ క్విజ్ పోటీలను క్విజ్ మాస్టర్ ధనుష్ రెడ్డి నిర్వహించారు. సుమారు 4 గంటల సేపు ఈ పోటీలు నిర్వహించారు. ఫైనల్ పోటీలో నిజామాబాద్ జిల్లా బన్సాల్ జూనియర్ కళాశాల విద్యార్థులు దినేష్‌కుమార్, అబయ్, వివేక్, సిద్ధార్థలు ప్రథమ స్థానంలో నిలిచారు. విజయ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు తరుణ్, చరణ్‌తేజ్‌లు ద్వితీయ స్థానం సాధించారు. ధర్పల్లికి చెందిన లిటిల్ హార్ట్స్ పాఠశాల విద్యార్థులు ఆర్. వినయ్, లోకేష్‌లు తృతీయ స్థానంలో నిలిచారు. వరుసగా 4, 5, 6 స్థానాల్లో ఎస్‌పిఆర్ పాఠశాల కామారెడ్డి, అభ్యాస పాఠశాల నిజామాబాద్, నిర్మల హృదయ జూనియర్ కళాశాల నిజామాబాద్ విద్యార్థులు సాధించారు. విద్యార్థులకు బహుమతులను ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, సూపరింటెండెంట్ మల్లారెడ్డి, హన్మంత్‌రావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రబాబునాయక్, డాక్టర్ విశాల్, ఉమ్మడి జిల్లాల ఎక్సైజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు డీసీపీ బస్వారెడ్డి



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎక్సైజ్ అధికారులు

యూరియా కొరతపై అధికారుల విచారణ

ధర్పల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరతపై అధికారులు స్పందించారు. శనివారం జిల్లా కోపరేటివ్ మానిటరింగ్ అధికారి ఆనంద్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్‌లు మండలంలోని దుబ్బాక గ్రామ రైతులతో మాట్లాడారు. అనంతరం మండల కేంద్రంలోగల సింగిల్ విండో కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. యూరియా కొరతపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. దుబ్బాక గ్రామంలో గల గిడ్డంగి వద్ద రైతులు యూరియా కోసం ఎదురు చూశారని మండల కేంద్రం నుంచి సిబ్బంది దుబ్బాక గ్రామానికి చేరుకోవడానికి ఆలస్యం కావడంతో రైతులు వేచి చూశారని అన్నారు. మండలంలో యూరియా కొరత ఎక్కడా లేదని దుబ్బాక గ్రామంలోగల గిడ్డంగిలో యూరియా బస్తాలు ఉన్నాయని అన్నారు. రైతులకు అవసరంమేరా యూరియాను అందుబాటులో ఉంచామని ఇప్పటికే ధర్పల్లి సొసైటీకి 20.25 టన్నుల యూరియా వచ్చిందని మరో 20 టన్నులు రావాల్సి ఉందని పేర్కొన్నారు. రైతులు అవసరం మేరకే యూరియాను కొనుగోలు చేసుకోవాలని రెండు పంటలకు ఒకేసారి యూరియా కొనుగోలు చేయడంతో చిన్నకారు రైతులకు యూరియా కొరత ఏర్పడుతుందన్నారు. రైతులు ప్రతీ పంటకు సరిపడా యూరియాను కొనుగోలు చేస్తే యూరియా కొరత ఉండదన్నారు. రైతులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని పంట పంటకు మాత్రమే యూరియా అవసరం మేరకే కొనుగోలు చేయాలని వారు సూచించారు. మండలంలోని హొన్నాజీపేట సొసైటీ పరిధిలో 33 టన్నులు, రామడుగు సొసైటీలో 31 టన్నుల యూరియా ఉందన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మండల వ్యవసాయ అధికారి చెప్పారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రికార్డులను పరిశీలిస్తున్న మానిటరింగ్ అధికారి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



మధ్యాహ్నభోజనం చేస్తున్న జడ్పీ సీఈవో

సదాశివనగర్,జనవరి4(ఆంధ్రజ్యోతి):విద్యార్థులకు ప్రభుత్వం అందించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలని జడ్పీ సీఈవో మండల ప్రత్యేకాధికారి చందర్‌నాయక్ తెలిపారు. మండలంలోని ధర్మారావుపేట్ ప్రభుత్వ పాఠశాలను ఎంపీ డీఓ సంతోష్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం చేసి నాణ్యతను పరిశీలించారు.అనంతరం ధర్మారావుపేట గ్రామశివారులోని రెన్యూ సోలార్ ఎనర్జీప్రైవేట్ లిమిటెడ్, మహిళ శక్తి పాడి పశువులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మం డల పరిషత్ అభివృద్ధి అధికారి సంతోష్‌కుమార్, ఎంఈవో యో సఫ్, మండల ఏపీఓ శ్రీనివాస్, ఏపీఎం రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ పట్ల తమాషా చేస్తే తడాఖా చూపిస్తాం



అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రామారెడ్డి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో లక్ష డప్పులు వెయ్యి గొంతులతో మండే మాదిగల గుండెచప్పుడు వినిపిస్తామని ఎమ్మార్పీఎస్ కామారెడ్డి జిల్లా పర్యవేక్షకులు మంథని సామ్యెల్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ అనుబంధ విభాగాల నూతన కమిటీల పునఃనిర్మాణంలో భాగంగా రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామంలో శనివారం డప్పులతో ర్యాలీ నిర్వహించి లక్ష డప్పులు, వెయ్యి గొంతులు కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునివ్వడం జరిగింది. అనంతరం నూతన కమిటీలను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యవేక్షకులు మంథని సామ్యెల్ మాదిగ, ముఖ్య అతిథిగా హాజరు కాగా సీనియర్ నాయకులు కొత్తోల్ల యాదగిరి మాదిగ, మహిళా నాయకురాలు సట్టిగారి లక్ష్మి మాదిగ, బానపురం లావణ్య మాదిగ, మండల కాస్త్రారి శైలేష్ మాదిగ, కర్రెం బాలరాజు, నూతన అధ్యక్షుడిగా తాండ్ర మల్లేష్, ఉపాధ్యక్షులు పల్లె స్వామి, ప్రదాన కార్యదర్శి గిరి సాయిలు, యూత్ విభాగం అధ్యక్షులు చిన్నవారి లింగం, ఉపాధ్యక్షులు సురేందర్, ప్రదాన కార్యదర్శి అఖిల్, మహిళా విభాగం అధ్యక్షురాలు గిరి శాంతవ్వ, ఉపాధ్యక్షులు ఎల్లిభూమయ్య లను ఎన్నుకోవడం జరిగిందని వివరించారు.

ఇస్కాన్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఇష్కాన్ ప్రతినిధులు

బాన్స్‌వాడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బాన్స్‌వాడ పట్టణంలోని హనుమాన్ మందిర్ ఆవరణలో శుక్రవారం రాత్రి ఇష్కాన్ సంస్థకు చెం దిన 2025 సంవత్సరానికి సంబందించిన క్యాలెండర్‌ను పాదయాత్ర గురు స్వామి వినయ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురు స్వామి వినయ్ మాట్లాడుతు దైవచింతనతో భగవంతున్ని సాన్నిహి త్యం పొంద వ చ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇష్కాన్ కామా రెడ్డి జిల్లా ఇన్‌చార్జి వెంకట్ దాస్, గోమాత సాయిలు, ప్రభుజీ నాగరాజ్, మోహన్ దాస్, అశోక్, గంగాధర్, లక్ష్మణ్ గుప్తా పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

సదాశివనగర్:సదాశివనగర్ మండల పంచాయతీరాజ్ టీచర్స్ యూనియన్ 2025 సంవత్సరపు క్యాలెండర్‌ను ఎస్‌ఐ రంజిత్ శనివారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్‌టీయూ యూనియన్ ఉపాధ్యాయులు బాధ్యత యుతంగా పనిచేస్తు విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందే విధంగా ప్రతి ఒక్కరు కృషిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో శనివారం పీఆర్టీయు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హజరైన రాష్ట్ర పీఆర్టీయు ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, పన్యాల శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్, వెంకట్‌రెడ్డి, రాధాలక్ష్మీ, కదిరే గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతులు సాగు పద్ధతులను పాటించాలి

రామారెడ్డి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పంటల సాగు కోసం రైతులు వ్యవసాయ శాఖ అధికారుల పద్దతులను, సలహాలు, సూచనలు పా టించాలని వ్యవసాయ విస్తీర్ణ అధికారి రాకేష్ పేర్కొన్నారు. రామారెడ్డి మండల కేంద్రంలో శనివారం వెదజల్లే వరి పొలాల్లో డ్రోన్ ద్వారా కలుపు మందుల పిచికారి చే యించడం తదితర అంశాలపై అవగా హన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు, యువకులు తదిరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా మిగిలిన గ్రంథాలయ భవన నిర్మాణపనులు పూర్తి చేస్తాం

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి

పెద్ద కొడప్‌గల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో నిధుల కొరతతో అసంపూర్తిగా మారిన గ్రంథాలయ భవన నిర్మాణ పనులు పూర్తి చేసి గ్రంథాలయ భవనంను వినియోగంలోకి తీసుకవస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో నిధులు లేక అసంపూర్తిగా మిగిలిపోయిన గ్రంథాలయ భవన నిర్మాణ పనులను స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా చైర్మన్ చంద్ర కాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో గ్రంథాలయ భవన నిర్మాణం కోసం రూ.5 లక్షల నిధులు మంజూరు కాగా ఆ నిధులతో పనులు చేశారని తెలిపారు. అయితే ఈ నిధులు సరిపోనందున పనులు నిలిచిపోయాయని, రానున్న కొద్దిరోజుల్లో స్థానిక శాసన సభ్యులు సహకారంతో మరో రూ.5లక్షల నిధులు మంజూరు చేయించుకుని భవననిర్మాణం పూర్తి చేసి భవనాన్ని వాడుకలోకి తీసుకవస్తామని తెలిపారు. అంతే గాక జిల్లావ్యాప్తంగా గల గ్రంథాలయాల్లో దాతల సహకారంతో వస తులు కల్పిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంశీక్రిష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేం దర్ రెడ్డి, నాయకులు చిప్ప మోహన్, పండరి, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

● గ్రంథాలయుల అభివృద్ధికి కృషి

పిట్లం:కామారెడ్డి జిల్లాలో గల గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తానని, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి అన్నా రు.ఆయన పిట్లం గ్రంథాలయాన్ని శనివారం పరిశీలించారు. గ్రంథాల యంలో రికార్డులు, రిజిష్టర్‌లను పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలో చదువుకోవడానికి, పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలు అందుబాటులో తీసుకరావడం జరుగుతుందన్నారు. మండల కాంగ్రెస్ నాయకులు జిల్లా చైర్మన్‌కు శాలువ, పూల మాలతో సన్మానం చేశారు. ఈకార్య క్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు హన్మం డ్లు, రాంరెడ్డి, మొహన్‌రెడ్డి, ఇమ్మురోజ్, కుమ్మరి రాములు, తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానిస్తున్న మండల కాంగ్రెస్ నాయకులు

రోడ్డు భద్రతప్రమాణాలపై విస్తృత ప్రచారం కల్పించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్,అధికారులు

కామారెడ్డిటౌన్, జనవరి 4: (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రోడ్డు ప్రమాదాలను నివారించడానికి పటిష్టచర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రతప్రమాణాల పై అవగాహన కల్పించేలా రోడ్డు భద్రత మసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర బీసీ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరేన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కేంద్ర ప్రభుత్వం రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించేదని, దీనిని దృష్టిలో పెట్టుకొని భద్రత మసోత్సవం చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి శాఖను భాగస్వామ్యం చేస్తూ విస్తృతంగా ప్రజలకు చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రోడ్డు భద్రత ప్రమాణాల పై వేడుకలను ప్రతి గ్రామంలో జరపాలని తెలిపారు. పిల్లల్లో రోడ్డు భద్రత ప్రమాణాల పై అవగాహన కల్పించేందుకు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. రోడ్డు భద్రత నియమాలను పాటించిన వారి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసి భవిషత్‌లో జారీ చేసేందుకు విలులేకుండా సాఫ్ట్‌వేర్ రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అలాగే రెసిడెన్షియల్ పాఠశాలలకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ మాట్లాడుతూ రోడ్డు భద్రత మసోత్సవాల సందర్భంగా విస్తృతం జిల్లా ప్రచార కార్యక్రమాలు, వ్యాసరచన పోటిలు, రంగోలి, ర్యాలీలు నిర్వహించాలని సూచించామని తెలిపారు. జిల్లాలో తెలంగాణ సాంస్కృతిక సారదులచే గ్రామ గ్రామన పాటల రూపంలో అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే ఏ ఆస్పత్రికి తీసుకెళ్లేలా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ నర్సింహారెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, డీఎంఅండ్ హెచ్‌వో చంద్రశేఖర్, డీఈవో రాజు తదితరులు పాల్గొన్నారు.

●అంధుల కోసం ప్రత్యేక లిపిని కనుగొన్న అక్షరప్రదాత లూయిస్ బ్రెయిలీ

అంధుల కోసం ప్రత్యేక లిపిని కనుగొన్న అక్షరప్రదాత లూయిస్ బ్రెయిలీ అని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం కామారెడ్డి కలెక్టరేట్‌లో లూయిస్ బ్రెయిలీ 216వ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇష్టపడి చదివి సమాజంలో మంచి గుర్తింపును పొందాలని అన్నారు. అంధులు ఆత్మ విశ్వాసంతో విద్యతో పాటు క్రీడలు,సాంస్కృతిక రంగాల్లో రాణించాలని అభిలషించారు. కళ్లులేవని అంధులు అధైర్యపడవద్దని బ్రెయిల్ లీపి ద్వారా చదువు నేర్చుకొని ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించాలని చెప్పారు. అంధులకోసం ఎలక్షన్ కమిషన్ బ్రెయిల్ లిపిలోబ్యాలెట్ పేపర్‌ను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. జిల్లాలో ప్రత్యేకంగా గ్రంథాలయం ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సహకారసంస్థ వారిచే బ్రెయిలీలిపిలో ప్రచురించబడిన బ్రేల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారిణి ప్రమీల, సీడీపీఓ రోచిష్మ పాల్గొన్నారు.

రాష్ట్రంలో 4 వస్థానంలో నిలిచిన జిల్లావాసి



గెరిగంటి లక్ష్మీనారాయణ

కామారెడ్డిటౌన్,జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి 11వ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటిలను శనివారం హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించారు. ఇటివల కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో 45 పై బడిన వయస్సు వారికి నిర్వహించిన అథ్లెటిక్స్ పోటిలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటిలకు ఎంపికైన గెరిగంటి లక్ష్మీనారాయణ 10 కిలో మీటర్ల దూరాన్ని 47 నిమిషాల్లో చేరుకొని రాష్ట్ర స్థాయిలో నాలుగోవ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు అథ్లెటిక్స్, వ్యాయమ ఉపాధ్యాయులు, జిల్లా వాసులు ఆయనను అభినందించారు. ప్రస్తుతం 30 సంవత్సరాల పై బడిన వారు ఎదోరకమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని అలాంటి వారికి స్ఫూర్తిగా నిలిస్తూ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడం సంతోషకరమైన విషయమని తెలిపారు.

ఆసుపత్రి భవన నిర్మాణ పనుల పరిశీలన



పనులు జరిగే ప్రాంతంలో ప్లాన్‌ను పరిశీలిస్తున్న పోచారం

బాన్సువాడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బాన్స్‌వాడ పట్టణంలో రూ.37.50 కోట్ల రూపాయల నిధులతో నిర్మిస్తున్న 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులను శనివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహా దారు, బాన్స్‌వాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. ఆ సుపత్రి పనుల పురోగతిపై అధికారులతో పాటు, కాంట్రాక్టర్‌ను వివ రాలు అడిగి తెలుసుకున్నారు. పనులు నాణ్యతతో కూడిన విధంగా ఉండాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. దీంతో పాటుగానే ఈ నెల 7న బాన్స్‌వాడకు జిల్లా ఇంచార్జి, ఎక్సైజ్ మంత్రి జూపల్లి ఎక్సైజ్ కార్యాల యం ప్రారంబోత్సవంతో పాటు వివిధ పనులకు శంఖుస్థాపన చేయ డానికి వస్తుండటంతో ఆ పనులను పోచారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాధితునికి సెల్‌ఫోన్ అప్పగింత

రామారెడ్డి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డిపేట్ గ్రామానికి చెందిన రమేష్ గత నెల క్రితం తన మొబైల్ రెడ్డిపేట్ గ్రామంలో పడిపోయింది. ఈ విషయంలో యువకుడు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ యాప్ ద్వారా ట్రేస్ చేసి ఫిర్యాదుదారుడైన రమేష్‌కు పట్టుకున్న మొబైల్ ఫోన్‌ని అప్పగించడం జరిగిందని ఎస్‌ఐ నరేష్ వివరించారు.

పెద్దకొడప్‌గల్:జుక్కల్ మండలంలోని డోన్‌గాం గ్రామానికి చెందిన రాథోడ్ బాలాజీ గత రెండు సంవత్సరాల కిందట తన ఫోన్ పోవ డంతో జుక్కల్ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ ఆచూకి లభిం చడంతో ఫోన్‌ను రికవరీ చేసి శనివారం బాధితుడికి అప్పగించారు.ఈ సందర్భంగా ఎస్సై భువనేశ్వర్ మాట్లాడుతు ప్రజలు తమ ఫోన్ పోగొట్టు కున్నట్లయితే పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేయాలని సూచించారు.

ఆర్థిక అక్షరాస్యతపై గ్రామస్థులకు అవగాహన

లింగంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండలంలోని నల్లమడుగలో శనివారం ఆర్థిక అక్షరాస్యతపై ఎస్ఎస్‌టీ స్వచ్ఛంద సంస్థ కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ హెల్త్‌వర్కర్ అనిత, మంజులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

నడుము నొప్పి భరించలేక ఆత్మహత్య

లింగంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐలాపూర్‌కు చెందిన రామస్వామి(28) నడుము నొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకార్ తెలిపారు. రామ స్వామి కొంత కాలంగా నడుము నొప్పితో బాధపడుతన్నాడని ఇప్పటికే అనేక ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్న తగ్గకపోవడంతో బాధను భరించలేక జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి ఉరివేసుకున్నడని మృతునికి తల్లి, భార్య, ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు.

జాతీయ స్థాయికి జిల్లా వాసి ఎంపిక

కామారెడ్డిటౌన్, జనవరి 04: (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కబడ్డీ జట్టు నుంచి జాతీయ స్థాయికి వంశీ అనే క్రీడకారుడు ఎంపికైనట్లు జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి రంగ వెంకటేశ్వర్‌గౌడ్ తెలిపారు. ఈ నెల 7న ఉత్తరఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి క్రీడల్లో వంశీ పాల్గొంటారని తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు యువకుడిఎంపిక

పిట్లం జనవరి 4: మండలంలోని గుడి తండాకు చెందిన హలావత్ వంశీ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.డిసెంబర్ 27న జరిగిన స్టేట్‌లెవెల్‌లో మంచి ర్యాంక్ సాధించాడు.నేషనల్ తెలంగాణ తరఫున ఆడెందుకు ఈనెల 7న ఉత్తర ఖండ్‌లో నేషన్‌లో ఆడెందుకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు.

సంవిధాన్ బచావో ఆందోళన విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఖాలేక్

బాన్స్‌వాడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంవిధాన్ దివస్‌ను పురస్కరించుకుని హైదరాబాద్‌లో జరుగుతున్న సంవిధాన్ బచావో ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా మైనార్టి అధ్యక్షుడు ఖాలేక్ పిలుపునిచ్చారు. శనివారం బాన్స్‌వాడ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ఈసందర్భంగా ఖాలేక్ మాట్లాడుతూ.. ఆదివారం సాయంత్రం 5 గంటలకు కులీకుతుబ్‌షా గ్రౌండ్‌లో ఆల్ ఇండి యా మైనారిటీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఇమ్రాన్ ప్రతాప్ ఆధ్వర్యం లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నందున మైనారిటీ సోదరులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు షహబ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అసద్బీన్, షాదీఖానా చైర్మన్ వ హబ్, బాన్స్‌వాడ మైనారిటీ అధ్యక్షుడు అబ్దుల్‌నబి, పట్టణ మైనారిటీ అధ్యక్షుడు అఫ్రోజ్, మాజీ ఉపసర్పంచ్ ఇమ్రొద్దీన్ మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

బాన్సువాడ: సంవిదాన్ దివస్‌ను పురస్క రించుకొని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నవంబర్ 26 నుంచి జనవరి 26 వరకు సంవిదాన్ బచావో ఆందోళన్ చేపడుతుంది. ఇందులో భాగంగా మన రాష్ట్ర మైనార్టీ డిపార్టుమెంట్ పిలుపు మేరకు ఆదివారం సాయం త్రం ఐదు గంటలకు కూలీ కుతుబ్షాహీ గ్రౌండ్‌లో ఆల్ ఇండియా మైనా రిటీ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఇమ్రాన్ ప్రతాప్ ఆధ్వర్యంలో గొప్ప బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఖాలేక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్య క్షుడు షహబ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అసద్బిన్ మహసిన్, షాదిఖానా చైర్మన్ వహబ్ బాన్సువాడ మైనార్టీఅధ్యక్షులు అబ్దుల్‌నబీ, నసరుల్లాబాద్ మైనారిటీ అధ్యక్షులు యూసుఫ్, బాన్సువాడ పట్టణ మైనారిటీ అధ్యక్షులు అఫ్రోజ్, మాజీ ఉపస ర్పంచ్ ఇమ్రుద్దీన్, మైనార్టీ నాయకులు అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటికాలుపై నిలబడి హమాలీల నిరసన

దోమకొండ, జనవరి 3(ఆంధ్రజ్యోతి):తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 4వ రోజులో భాగంగా శనివారం ఎంఎల్ఎస్ సీవిల్ సప్లై హమాలీలు ఒంటికాలుపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎగుమతి, దిగుమతి ధర క్వింటాలుకు రూ. 29 చెల్లించాలని, ప్రతి హమాలీ కూలీలకు డబుల్ బెడ్ రూంతో పాటు వివిధ సమస్యలను పరిష్కరించాలన్నారు.కార్యక్రమంలో హమాలీలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ సర్వే నిర్వహణ

రామారెడ్డి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ పనులపై ఇంటింటా సర్వే నిర్వహణ 90 శాతం పూర్తయినట్లు రామారెడ్డి ఎంపీడీవో ఏలేటి తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. రామారెడ్డి మండలం అన్నారం గ్రామంలో శనివారం ఇంటింటికీ సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాగర్ గౌడ్, కారోబార్ పి. రాజేందర్, సిబ్బంది రాజేందర్, భూమయ్య, బాల్ రాజవ్వ, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ:ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం దోమకొండలో కార్యదర్శులు నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మాణిక్యారావు, మనోఎహర్, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, ఆపరేటర్‌లు శ్రీకాంత్, వెంకటేష్, ప్రశాంత్, కార్యదర్శులు యాదగిరి, రమేష్, స్నేహ, వసంత, సౌందర్య, పద్మ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ

ఎల్లారెడ్డి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిపేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు శుక్రవారం కామారెడ్డి దేవునిపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న ముప్పవరం ఉమాకాంత్ లింగారెడ్డిపేట్‌లో విద్యా బోధనలు చేసిన సందర్భంగా జ్ఞాపకార్థంగా పాఠశాలకు సంబంధించిన పుస్తకాలు భద్రపరుచుకోవడానికి రూ. 9 వేల విలువ గల లైబ్రరీ బీరువాను బహుకరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు దాసిరామ్, ఉపాధ్యాయులు రామకృష్ణ ఉమాదేవి, షఫీయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్ ఉన్నత పాఠశాలలో గణిత మేళా

బీర్కూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం గణిత మేళా నిర్వహించారు. ఎంఈవో వెంకన్న ఈ మేళాను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రదానోపాధ్యాయుడు శివరాం, ఉపాధ్యాయులు రాధాకృష్ణ, సంజీవ రెడ్డి, అశోక్ రెడ్డి, శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్‌లో ఫ్రెండ్‌షిప్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

పెద్ద కొడ ప్‌గల్,జన వ రి4 (ఆంధ్ర జ్యోతి): పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో ఈ నెల 7నుంచి ఫ్రెండ్ షిప్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల ను నిర్వహించనున్నట్లు నిర్వాహ కులు ప్రేమ్ సింగ్, రవీందర్, బల్ రాం, రాం దాస్‌లు తెలిపారు.ఈ పో టీలలో పాల్గొనే జట్లు ఈ నెల 6వ తేదీ లోగా రూ.1100 ఎంట్రీ ఫీజు చెల్లించి పోటీలలో పాల్గొన వచ్చని తెలిపారు. ఈ పోటీలలో గెలు పొంది ప్రథమ స్థానంలో నిలిచిన జ ట్టుకు రూ.25555, ద్వితీ య స్థా నం సాధించిన జట్టుకు రూ. 12222 నగదు బహుమతి అంద జేస్తామని తెలిపారు. మ రిన్ని వివరాల కోసం 9912031221, 7093345325, 8008871275 సంప్రదించాలని కోరారు.

చాముండేశ్వరి ఆలయాభివృద్ధికి చెక్కు అందజేత



కమిటీకి చెక్కు అందజేస్తున్న కామినేని శోభన,

దోమకొండ, జనవరి 4(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని చాముండేశ్వరీ ఆలయంలో సాలరం నిర్మాణం కోసం గడికోట వారసులు కామినేని శోభన, అనిల్ కుమార్ దంపతులు శనివారం రూ. 5 లక్షల చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా అర్చకులు భావి శరత్ చంద్ర అర్చన కార్యక్రమాలు నిర్వహించి వారికి తీర్థప్రసాధాలు అందజేశారు. శాలువాతో సన్మానించి మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో సిద్దారెడ్డి, తీగల తిర్మల్‌గౌడ్,అబ్రబోయిన స్వామి, తాటిపల్లి శ్రీకాంత్, నారాయణరెడ్డి, పున్న లక్ష్మణ్, ఏఎంసీ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, రమేష్, కంది రాజయ్య, నల్లపు అంజలి, శ్రీనివాస్, నరేష్, శేఖర్, బాల్‌రాజు, బాబ్జి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

బిచ్కుంద, జనవరి 4: (ఆంధ్రజ్యోతి): మంజీర పరివాక ప్రాంతాల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. శనివారం మండలంలోని దేవాడ, పుల్కల్, హాసుగుల్, ఖత్గాగావ్ గ్రామాల నుంచి ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఎవరైన అక్రమంగా ఇసుకను తరలిస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి - రోటి కపడా రోమాన్స్
దర్శన్ - యూఐ
ప్రియా 70 - పుష్ప-2
ప్రియా 35 - మ్యాక్స్

బాన్సువాడ

మహేశ్వరి - పుష్ప-2
వెంకటేశ్వర - మ్యాక్స్

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	160
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

